క్లుప్తంగా

'కోటంక'లో ప్రత్యేక పూజలు


అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

గార్లదిన్నె: మండలంలోని కోటంక కొండల్లో వెలసిన గుంటి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రధాన అర్చకుడు రామాచార్యులు అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. మహిళలు,భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్న దాన కార్యక్రమం నిర్వహించారు.

నారాయణుడికి పూజలు


అలంకరణలో శింగరబట్లు, గణపతి, అశ్వర్థనారాయణుడు

పెద్దపప్పూరు: మండలంలోని చిన్నపప్పూరు గ్రామ సమీపంలో పెన్నానది ఒడ్డున వెలసిన అశ్వత్థంలో ఆదివారం అర్చకులు సుధీర్‌కుమార్‌శర్మ, బాలసుబ్రమణ్యశర్మ, సునీల్ కుమార్ శర్మ తదితరులు నారాయణస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులకు వారు స్థల పురాణం వివరించి తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. భక్తులు మూలవిరాట్‌ను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

స్ట్రాంగ్ రూమ్ పరిశీలన


జేఎన్‌టీయూలో భద్రపరిచిన ఈవీఎంలను పరిశీలిస్తున్న వీరాంజనేయులు

శింగనమల: అనంతపురంలోని జేఎన్‌టీయూలో భద్రపరచడం శింగనమల అసెంబ్లీకి సంబంధించిన ఈవీఎంలను ఆదివారం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజనేయులు పరిశీలించారు. అక్కడ ఉన్న సిబ్బందితో వివరాలడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట బుక్కరాయసముద్రం జెడ్పీటీసీ భాస్కర్ ఉన్నారు.

బైబిల్ పాఠశాలను సద్వినియోగం చేసుకోండి

పామిడి: పట్టణంలోని సీఎస్‌ఐ చర్చిలో 6, 7, 8, 9 తేదీల్లో నిర్వహించే విరామ బైబిల్ పాఠశాలను క్రైస్తవ, క్రైస్తవేతర విశ్వాసుల పిల్లలు సద్వినియోగం చేసుకోవాలని పాస్టర్ రెవరెండ్ బీవీ విశ్వమోహన్ సూచించారు. ఆదివారం ఆయన మాట్లాడూ చిన్ననాటి నుంచే పిల్లలను సన్మార్గంలో పయనింప జేయడానికి విరామ బైబిల్ స్కూల్ తోడ్పడుతుందన్నారు. మండల వ్యాప్తంగా ఒకటి నుంచి పదో తరగతి చదువుతున్న పిల్లలు అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

బొలెరో వాహనం బోల్తా

గార్లదిన్నె: మండల కేంద్రం సమీపంలోని లోలూరు క్రాస్ 44వ జాతీయ రహదారిపై ఆదివారం టమాట తరలిస్తున్న బొలెరో వాహనం బోల్తా పడింది. స్థానికుల వివరాల మేరకు.. మదనపల్లి నుంచి బొలెరో వాహనం టమాట లోడ్‌తో హైదరాబాద్ బయలేదేరింది. లోలూరు క్రాస్ వద్దకు రాగానే వెనుక టైర్ పంచర్ కావడంతో వాహనం బోల్తా పడింది. ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. వెంటనే మరో వాహనంలో టమాటాలు లోడ్ చేసి హైదరాబాద్‌కు తరలించారు.

గార్లదిన్నెకు చేరుకున్న పాదయాత్ర


జిల్లా పరిషత్ హైస్కూల్లో జైన మత సిద్ధాంతాలు వివరిస్తున్న దిగంబర స్వామి

గార్లదిన్నె: జైన మత దిగంబర స్వాముల పాదయాత్ర ఆదివారం గార్లదిన్నెకు చేరుకుంది. వివరాలు.. జైన మతానికి చెందిన అంతర్మాన ప్రసన్న సాగర గురువుతో పాటు 17 మంది దిగంబర స్వాములు కర్ణాటకలోని గోమటేశ్వర స్వామి ఆలయం నుంచి హైదరాబాద్‌లోని కుల్‌చారమ్ జైన దేవాలయం వరకూ ఏప్రిల్ 25న పాదయాత్ర కు శ్రీకారం చుట్టారు. శనివారం రాత్రి రాప్తాడులో బస చేసి, ఆదివారం ఉదయం పాదయాత్ర ప్రారంభించి గార్లదిన్నెకు చేరుకున్నారు. రాత్రికి జిల్లా పరిషత్ హైస్కూల్లో బస చేశారు. ఈ సందర్భంగా అక్కడ భక్తులకు స్వాములు జైన మత సిద్ధాంతాలను వివరించారు. ప్రజలు సంతోషంగా ఉండాలని పాదయాత్ర చేస్తున్నట్లు వారు తెలిపారు.

విజయోత్సవాలు, సంబరాలపై నిషేధం

కౌంటింగ్ అనంతరం విజయోత్సవాలు, ర్యాలీలు, సంబరాలు నిర్వహించొద్దని పోలీసులు సూచిస్తున్నారు. ఏ పార్టీ గెలిచినా ప్రజలు సంయమనంతో ఉండాలన్నారు. గొడవలు, ఘర్షణలకు దిగొద్దన్నారు. శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే ఎంతటి వారైనా సరే చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు.

- కౌంటింగ్ నేపథ్యంలో పోలీసుల ఆంక్షలు
- నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవంటూ హెచ్చరికలు


పుట్లూరు మండలం శనగలగూడూరులో మాట్లాడుతున్న సీఐ సుబ్రమణ్యం


యాడికి కోనరోడ్డులో ప్రజలతో మాట్లాడుతున్న సీఐ నాగార్జునరెడ్డి

పుట్లూరు: ఎన్నికల ఫలితాల అనంతరం బాణసంచా పేల్చడం, ర్యాలీలు నిర్వహించడం తదితర కార్యక్రమాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని సీఐ సుబ్రమణ్యం హెచ్చరించారు. ఆదివారం ఆయన మండలంలోని కడవకల్లు, శనగలగూడూరు, పుట్లూరు తదితర గ్రామాల్లో పర్యటించారు. ఎన్నికల ఫలితాల అనంతరం ఆయా గ్రామాల్లో జరిగే పరిస్థితులపై ఆరా తీశారు. ప్రతిఒక్కరూ వివాదాలకు దూరంగా ఉండాలని సూచించారు. శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ హేమాద్రి, సిబ్బంది పాల్గొన్నారు.

కోడ్ ఉల్లంఘించొద్దు

యాడికి: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఈ నెల 4న ఓట్ల లెక్కింపు అనంతరం విజయోత్సవ సంబరాలు నిషేధమని యాడికి అప్ గ్రేడ్ సీఐ నాగార్జునరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని కోన రోడ్డులో ప్రజలతో ఆదివారం సీఐ మాట్లాడుతూ జూన్ 6 వరకూ ఎన్నికల కోడ్ ఉంటుందన్నారు. కోడ్ ఉల్లంఘించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. విజయోత్సవ సంబరాలు ర్యాలీలు, బాణ సంచా కాల్చడం తదితర వేడుకలు నిషిద్ధమన్నారు. 144 సెక్షన్ అమల్లో ఉందన్నారు. ఎక్కడా గుంపులుగా ఉండరాదని, బైక్‌ల సైరన్ తీసివేసి అధిక స్పీడ్‌తో వెళ్లి ప్రజల శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో ఎక్కడా గొడవలకు తావులేకుండా అదనపు బలగాలతో పటిష్టమైన బందోబస్తు చర్యలు తీసుకున్నట్లు సీఐ తెలిపారు.

శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే సహించబోం

పెద్దవడుగూరు: మండలంలో ప్రతి గ్రామంపై ప్రత్యేక దృష్టి పెట్టామని, ఎవరైనా శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే సహించబోమని ఎస్‌ఐ శ్రీనివాసులు హెచ్చరించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ నేపథ్యంలో మండల వ్యాప్తంగా 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. పోలీసుల అనుమతులు లేకుండా ఎవరైనా రాజకీయ నాయకులు, కార్యకర్తలు సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు.. ఎవరైనా ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఏ పార్టీ విజయం కోసం ఎవరూ పని చేసినా.. ఫలితాల అనంతరం అందరూ కలసి పోయి శాంతియుతంగా జీవించాలన్నారు.


పెద్దవడుగూరులో పోలీసులకు సూచనలిస్తున్న ఎస్‌ఐ శ్రీనివాసులు

600 మంది బైండోవర్


సీఐ వెంకటరామిరెడ్డి

గుత్తి: మండల వ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన రోజు నుంచి ఆదివారం వరకూ మొత్తం 600 మందిని బైండోవర్ చేయించినట్లు సీఐ వెంకటరామిరెడ్డి తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రౌడీ షీటర్లు, ట్రబుల్ మాంగర్స్, వివిధ కేసుల్లో నిందితులు, అల్లర్లు చేస్తారనే అనుమానం ఉన్న వ్యక్తులను బైండోవర్ చేయించామన్నారు. కౌంటింగ్‌కు ముందు మరి కొంతమందిని బైండోవర్ చేయిస్తామన్నారు. ప్రజలందరూ ప్రశాంతంగా జీవించాలన్నారు. ప్రశాంతతకు భంగం కలిగించినా, అల్లర్లు, ఘర్షణలకు దిగినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవన్నారు. 144 సెక్షన్‌తో పాటు 30 పోలీసు యాక్ట్ అమలులో ఉన్నాయన్నారు. అందరూ చట్టానికి లోబడి, నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలన్నారు.

పామిడిలో 20 మంది..

పామిడి: ఎన్నికలకు సంబంధించి జూన్ 4న చేపట్టే కౌటింగ్‌ను పురస్కరించుకుని ఆదివారం అన్ని రాజకీయ పార్టీలకు సంబంధించి 20 మందిని పోలీసులు బైండోవర్ చేశారు. సీఐ రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎస్‌ఐ బెస్తరాజు సారథ్యంలో వారిని సోమవారం తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్ ఎదుట హాజరు పరచనున్నట్లు పోలీసులు తెలిపారు.

రూరల్ సీఐపై చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న దేరంగుల ఉదయ్‌కిరణ్

గుంతకల్లు: ఎన్నికల కమిషన్ ఆదేశాలను బేఖాతరు చేసిన రూరల్ సీఐపై చర్యలు తీసుకోవాలని బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు దేరంగుల ఉదయ్‌కిరణ్ డిమాండ్ చేశారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ అభ్యర్థి గుమ్మనూరు జయరాం సోదరుడు నారాయణపై ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై కేసు వేసినందుకు, వారి నుంచి ప్రాణహని ఉందని, రక్షణ కల్పించాలని మే 17న ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశానన్నారు. స్పందించిన ఎన్నికల కమిషన్ జిల్లా ఎస్పీ ఈ అంశంపై విచారణ చేపట్టాలని రూరల్ సీఐ మహేశ్వర్‌రెడ్డికి ఆదేశాలు జారీ చేశారన్నారు. అయితే సీఐ విచారణ పక్కదారి పట్టించేలా రిపోర్టు తయారు చేసి పంపారన్నారు. ఉదయ్‌కిరణ్ వైఎస్సార్‌సీపీకి చెందిన వ్యక్తే కాదని, పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనలేదని రిపోర్టు ఇవ్వడంతోపాటు ఎమ్మెల్యే వైవీఆర్, సీఎం జగన్‌పై గుమ్మనూరు నారాయణ బెదిరింపులు కూడ చేయలేదని రిపోర్టు ఇచ్చి పక్కదారి పట్టించాడని ఆరోపించారు. గత 15 ఏళ్లుగా వైఎస్సార్ సీపీలో ఉంటూ ఎన్నో ఉద్యమ కార్యక్రమాలు, ప్రచారంలో పాల్గొన్నానని ఆయన గుర్తు చేశారు. అంతేకాకుండా గుమ్మనూరు నారాయణ బెదిరింపు కేసు గుత్తి కోర్టులో పెండింగ్‌లో ఉందన్నారు. ఈ విషయాలను పరగణలోకి తీసుకోకుండా ఇష్టానుసారంగా రిపోర్టు తయారు చేసిన రూరల్ సీఐపై చర్యలు తీసుకోవడంతోపాటు తన రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేస్తూ ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసినట్లు ఆయన వివరించారు.


అప్పటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

గుంతకల్లు: పట్టణంలోని శంకరనందగిరి డిగ్రీ కళాశాలకు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం సమ్మేళనం కార్యక్రమం నిర్వహించారు. 1995–98 సంవత్సర బీకాం డిగ్రీ విద్యార్థుల అందరూ కళాశాల వేదికగా కలుసుకున్నారు. ముఖ్య అతిథులుగా కరస్పాండెంట్ హరి, రిటైర్డ్ ప్రిన్సిపాళ్లు ఎంసీ బాలయ్య, ఆర్కే నాయుడు, ప్రస్తుత ప్రిన్సిపాల్ పి.గోపాల్ హాజరయ్యారు. అప్పటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకుని ఆనందంగా గడిపారు. అనంతరం ముఖ్య అతిథులతోపాటు అధ్యాపకులు రాధాకృష్ణ, రంగయ్య, నారాయణను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మాధవి, నవీన్, షర్పుద్దీన్, కేదార్నథ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అపర ఏకాదశి


అలంకరణలో అనంత గజగరుడ లక్ష్మీనారాయణస్వామి


శ్రీదేవి, భూదేవి సమేత ఉత్సవ విగ్రహాలు

పామిడి: పట్టణ తగ్గదేవాలయంలో ఉన్న అనంత గజగరుడ లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో ఆదివారం అపర ఏకాదశిని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీనారాయణస్వామి దేవతామూర్తుల విగ్రహాలను శోభాయానంగా అలంకరించారు. వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు, అభిషేక అర్చనలు నిర్వహించారు, అనంతరం భక్తులు విష్ణు సహస్రనామ పారాయణం పఠించారు. ఈసందర్భంగా దేవతామూర్తుల ఉత్సవ విగ్రహాలను పల్లకిలో ఉంచి ప్రాకారోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం గోవింద నామస్మరణతో మార్మోగింది. ఏటా వైశాఖ బహుళ ఏకాదశిని అపర ఏకాదశిగా నిర్వహించడం ఇక్కడ ఆనవాయితీ.


అనంత గజగరుడ లక్ష్మీనారాయణస్వామి ప్రాకారోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

నేడు హుండీ కానుకల లెక్కింపు

ఉరవకొండ: పెన్నహోబిలం లక్ష్మీనృసింహస్వామి శాశ్వత హుండీ కానుకలను సోమవారం లెక్కించనున్నట్లు ఈఓ విజయ్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. దేవదాయ, ధర్మదాయశాఖ బ్రహ్మోత్సవాల ప్రత్యేక అధికారి సమక్షంలో ఉదయం 9 గంటలకు హుండీ కానుకలు లెక్కించనున్నట్లు తెలిపారు.

గుత్తిలో మోస్తరు వర్షం

గుత్తి: గుత్తి, గుత్తి ఆర్‌ఎస్‌లలో శనివారం అర్ధరాత్రి మోస్తరు వర్షం కురిసింది. 6.8 ఎం.ఎం. వర్షపాతం నమోదైందని అధికారులు తెలిపారు.

బాబోయ్ కుక్కలు!

తాడిపత్రి పట్టణంలో కుక్కల బెడద ఎక్కువైంది. ఎక్కడ చూసినా కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. దీంతో బయటకు వచ్చేందుకు ప్రజలు జంకుతున్నారు. పలుచోట్ల కుక్కల దాడిలో గాయపడిన వారు ప్రభుత్వ సర్వజనాస్పత్రి చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అధికారులు స్పందించి కుక్కల సమస్యకు పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

- హడలెత్తిపోతున్న ప్రజలు
- అధికారులు స్పందించాలంటూ వినతి


ఏటిగడ్డ పాలెంలో గుంపులుగా సంచరిస్తున్న కుక్కలు

తాడిపత్రి అర్బన్: కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతూ ప్రజలపై దాడులకు తెగబడుతుండటంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. పట్టణంలోని చింతల రాయుని పాలెం, కూరగాయల మార్కెట్, కాల్వగడ్డ వీది, నందలపాడు, పీర్లమాన్యం, జయనగర్‌కాలనీ, చేనేత కాలనీ, ఏటిగడ్డపాలెం, పోతులయ్య పాలెం, పోరాట కాలనీ, గాంధీనగర్ తదితర ప్రాంతాల్లో కుక్కల బెడద తీవ్రంగా ఉంది. నిత్యం ప్రజలు, చిన్నారులు, మహిళలపై దాడి చేసి గాయపరుస్తున్నాయి. ఏటేటా పెరిగిపోతున్న కుక్కల సంతతిని అదుపు చేసేందుకు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో వాటి సంఖ్య గణనీయంగా పెరిగిపోతోంది. ప్రస్తుతం వర్షాకాలం సీజన్ సీజన్ సమీపిస్తుండడంతో కుక్కకాటు వల్ల రేబిస్ వ్యాధి వేగంగా సోకే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

రాత్రి వేళ అడుగు బయట పెట్టాలంటేనే భయం

రాత్రి వేళల్లో ఇంట్లో నుంచి బయటకు అడుగు పెట్టాలంటేనే ప్రజలు జంకుతున్నారు. ఇక చిన్నారులను ఒంటరిగా బయటికి పంపాలంటేనే భయపడుతున్నారు, రాత్రి పూట రోడ్లపై వెళ్లే వాహన చోదకులను కుక్కలు వెంటపడి మరి తరుముతున్నాయి. అవి ఎక్కడ కరుస్తాయో అనే భయంతో వాహన చోదకులు వేగంగా నడిపి అదుపు తప్పి కిందపడి తీవ్ర గాయాలపాలవుతున్నారు. పది రోజుల కిందట రాత్రి 11 గంటల సమయంలో ఓ జంట ద్విచక్ర వాహనంలో వస్తుండగా కాలువగడ్డ వీధిలో కుక్కలు తరమడంతో వాహనం వేగంగా వెళడంతో స్పీడ్ బ్రేకర్ అడ్డు వచ్చి అదుపుతప్పి కిందపడిపోయారు. ఘటనలో భార్యకు ఎడమ కాలు విరగగా, భర్తకు కుడి చేయి విరిగింది, పాదచారులు చేతిలో కర్ర లేకుండా ఇంటి నుంచి బయటకు వచ్చేందుకు సాహసించడం లేదు. ఒక్కోసారి కుక్కలు వాటిలో అవే పోట్లాడుకుంటూ ఆ మార్గంలో వెళ్లే వారిని గాయపరుస్తున్నాయి. కుక్కల ఘర్షణలో గాయపడినవి పిచ్చికుక్కలుగా మారి ప్రజలు, పశువులపై దాడులు చేస్తున్నాయి. పెన్నా నదిలో గేదెలను మేపేందుకు వెళ్లిన పశుకాపరులపై కూడా రెండు వారాల క్రితం కుక్కలు దాడి చేశాయి. ఈ క్రమంలో గేదెలు తిరగబడడంతో.. వాటిపై కూడా కుక్కలు దాడి చేసి గాయపరిచాయి. దీంతో వేలాది రూపాయల విలువైన పశువులు మృత్యువాత పడుతున్నాయి. దీంతో పాడి రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. పట్టణంలోని 21 వార్డుల్లో సుమారు 3,500కు పైగానే కుక్కలు ఉన్నాయని అంచనా. వీటి నియంత్రణకు అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మోడల్ స్కూల్లో మిగులు సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

గార్లదిన్నె: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్లో 7, 8, 9వ తరగతిలో మిగిలిన సీట్ల భర్తీ కోసం అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సతీష్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 15 లోపు విద్యార్థులు పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 19వ తేదీ పాఠశాలలో విద్యార్థులకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు. ప్రవేశ పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగా సీట్లు కేటాయిస్తామన్నారు. మండల విద్యార్థులు సద్వినియోగం చేసుకో వాలన్నారు.

ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

బుక్కరాయసముద్రం: మండల కేంద్రలోని జెడ్పీ హైస్కూల్‌లో ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రధానోపాధ్యాయురాలు వసుంధర సూచించారు. ఈ ఏడాది నుంచి బీకేఎస్ హైస్కూల్‌లో బాల, బాలికలకు ఇంటర్ మీడియట్ ప్రారంభిస్తున్నామన్నారు. ఎంపీసీ 40 సీట్లు, సీఈసీ 40 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. మండలంలోని పదోతరగతి విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఇంటర్ మొదటి సంవత్సర ప్రవేశానికి దరఖాస్తుచేసుకోవాలన్నారు. వివరాలకు బీకేఎస్ జెడ్పీ హైస్కూల్‌లో సంప్రదించాలన్నారు.

కార్తికేయుడికి పంచామృతాభిషేకాలు

ఆత్మకూరు: మండలంలోని పంపనూరులో ఉన్న సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలతో పాటు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం మూల విరాట్‌కు బంగారు ఆబరణాలతో పాటు, పట్టు వస్త్రాలు ధరింప చేసి ఆకుపూజ, విశేష పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో పెద్దఎత్తున కాలసర్పదోష నివారణ రాహుకేతు హోమాలు నిర్వహించారు. అలాగే ఆలయంలోని మంజునాథ స్వామి, పార్వతీదేవికి ప్రత్యేక పూజలు అనంతరం మహా మంగళహారతి అందించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

వ్యక్తి మృతి


వీరారెడ్డి (ఫైల్)

బుక్కరాయసముద్రం: మండలంలోని చెన్నంపల్లిలో ఆత్మహత్యకు యత్నించిన వీరారెడ్డి (28) చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల వివరాలు.. చెన్నంపల్లి గ్రామానికి చెందిన ఈశ్వరరెడ్డి కుమారుడు వీరారెడ్డి బెంగళూరులోడో హార్డ్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. గ్రామంలో పంటల సాగుకు, కుటుంబ పోషణ కోసం రూ.8 లక్షల వరకూ అప్పులు చేశాడు. అప్పు తీరే మార్గం కానరాక మానసిక వేదనతో మూడు రోజుల క్రితం పురుగుల మందు తాగాడు. కుటుంబీలకు వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం అక్కడి వైద్యుల సూచన మేరకు కర్నూలు ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతునికి భార్య, కూతురు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

టీసీ హైస్కూల్‌కు నూతన శోభ


'నాడు- నేడు' పనుల ద్వారా ముస్తాబైన పామిడి టీసీ హైస్కూల్

పామిడి: పట్టణంలోని టీసీ హైస్కూల్ రూపురేఖలు మారాయి. నాడు–నేడు కార్యక్రమం కింద పాఠశాల సర్వాంగసుందరంగా తయారైంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగానికి పెద్దపీట వేస్తూ పాఠశాలలను మెరుగుపర్చేందుకు ప్రవేశ పెట్టిన 'నాడు–నేడు'తో టీసీ హైస్కూల్ కొత్త శోభ సంతరించుకుంది. గతంలో శిథిలమైన తరగతి గదులు, తాగునీరు, డెస్కులు, మరుగుదొడ్లు వంటి కనీస వసతులు కరువై స్కూల్ సమస్యల వలయంలో కొట్టుమిట్టాడేది. ప్రస్తుతం అన్నిహంగులతో కూడిన మౌలిక వసతుల కల్పనతో స్కూల్ కొత్త కళకు నోచుకుంది. 1949లో ఏపీ మద్రాసు ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న సమయంలో ఈ పాఠశాల హైయ్యర్ సెకెండరీ స్కూల్ (ఎస్ఎస్ఎల్‌సీ)గా ప్రారంభమైంది. కాలక్రమేణా ఈ స్కూల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలగా ఏర్పడింది. 1998లో హైస్కూల్, జూనియర్ కళాశాలగా విడిపోయింది. 1999లో స్కూల్ స్థలదాత పేర టంగుటూరి చిన్నప్ప శ్రేష్ఠి (టీసీ) హైస్కూల్ అయ్యింది. ఈ స్కూల్‌లో విద్యనభ్యసించిన ఎంతో మంది ప్రభుత్వ ఉన్నత పదవుల్లో కొలువుదీరారు. నాడు–నేడు పథకం కింద రూ.76.40 లక్షలతో రంగులతో కొత్తమెరుగును సంతరించుకున్న ఈ హైస్కూల్ కార్పొరేట్ పాఠశాలను తలపిస్తోంది.